AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatodaynews.com


## ఆర్మూర్ ఎంఈవోగా రవీందర్



**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆర్మూర్ మండల నూతన ఎంఈవోగా మామిడిపల్లి హెచ్ఎం డి.రవీందర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉర్దూ బోధనకు సంబంధించిన విషయంలో కలెక్టర్ సూచనల మేరకు పూర్వ ఎంఈవో రాజగంగారాంను అర్జేడీ విధుల నుంచి రిలీవ్ చేశారు. ఈ సందర్భంగా నూతన ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించిన రవీందర్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.


29-7-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2




## శ్రీరామ్‌సాగర్‌కు జలకళ..

**అక్షరటుడే, ఆర్మూర్ :** రెండు రోజుల కురుస్తున్న భారీ వర్షాలతో ఉత్తర తెలంగాణ వరప్రదాయని శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద కొనసాగుతోంది. గతేడాదితో పోలిస్తే ఆలస్యంగా ఇన్‌ఫ్లో వస్తున్నా.. వర్షాలతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టులోకి 4,051 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 1,091 అడుగులు 80.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 1,065 అడుగులు 16.405 టీఎంసీలుగా ఉంది. గతేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 1,075 అడుగులు 32.897 టీఎంసీల నీటి నిలువ ఉంది. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ప్రాజెక్టులో 16 టీఎంసీలు తక్కువగా నీటి నిల్వ ఉంది. కాగా ప్రస్తుతం వర్షాలు కురుస్తూ.. వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్ట్ పరిధిలోని ఆయకట్టు రైతులు ఖరీఫ్ పంటలకు సిద్ధమవుతున్నారు.



## బాన్సువాడ ఎంసీహెచ్‌లో వైద్య సిబ్బంది నిరసన

**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలోని మాతా శిశు ఆసుపత్రి (ఎంసీహెచ్)లో సస్పెండ్ అయిన ఇద్దరు నర్సులకు మద్దతుగా వైద్యులు, పారామెడికల్ సిబ్బంది చేపట్టిన నిరసన రెండో రోజూ కొనసాగింది. డాక్టర్లు శ్రీలత, ప్రకాష్ మాట్లాడుతూ.. బాలింతల కేసు విషయంలో ఇద్దరు నర్సులను సస్పెండ్ చేయడంతో పాటు మత్తు వైద్యుడిని విధుల నుంచి తొలగించడాన్ని తీవ్రంగా ఖండించారు. సిబ్బంది వల్ల ఏదైనా తప్పిదం జరిగితే ముందుగా మెమో జారీ చేసి వివరణ కోరాల్సి ఉంటుందని, నేరుగా సస్పెండ్ చేయడం, విధుల నుంచి తొలగించడం సరైన చర్య కాదని అన్నారు. డాక్టర్లు సాయిలు, ప్రవీణ్‌తో పాటు పారామెడికల్ సిబ్బంది హిమాయత్, సాగర్, హెడ్ నర్స్ అమృత తదితరులు పాల్గొన్నారు.

# ఆశల వాన..



ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో అనేక మార్పులు చోటుచేసుకున్నాయి. వానాకాలం సీజన్ ప్రారంభమై 50 రోజులైనా ఆశించినంతగా వర్షా లు కురవలేదు. ఎట్టకేలకు వారం నుంచి వర్షా లు ప్రారంభమయ్యాయి. దీంతో ఖరీఫ్‌పై బోలెడంత ఆశలు పెట్టుకున్న రైతాంగం వ్యవసాయ పనుల్లో నిమగ్నమైంది.

- అక్షరటుడే, ఎల్లారెడ్డి

- ఉమ్మడి జిల్లాలో విస్తారంగా వర్షా లు
- ఊపందుకున్న సాగు పనులు
- ఆరుతడి పంటలకు సైతం ఊపిరి

జిల్లావ్యాప్తంగా ఈ వానాకాలం సీజన్‌లో 1.70 లక్షల ఎకరాల్లో వరి పంట, 1.83 లక్షల ఎకరాల్లో వర్షాధార రకాల పంటలు సాగుపుతాయని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇంకా 1.20 లక్షల ఎకరాల్లో నాట్లు వేసేందుకు భూములు సిద్ధంగా ఉన్నాయి. అయితే ఏడాది ఎల్‌నినోతో ముప్పు పొంచి ఉందని, వర్షాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ పంటలు సాగు చేయాలని, వరికి బదులు ఆరుతడి పంటలు సాగు లాభదాయకమంటూ రైతులకు విన్నతంగా అవగాహన కల్పించారు. అయినా రైతులు ఎప్పటిలాగే వరిసాగుకు మొగ్గు చూపారు.

### బోరుబావుల ఆధారంగా..

బోరుబావుల ఆధారంగా తుకాలు పోశారు. గత నెల ఆడపాదడపా కురిసిన వర్షాలకు వేసిన దుక్కులు దున్ని సాగుకు సిద్ధమయ్యారు. అదే విధంగా పత్తి విత్తనాలు వేశారు. కాగా జూన్‌లో లోటు వర్షపాతం నమోదైంది. దీంతో అన్నదాతలు ఆందోళనకు గురయ్యారు. ఎల్‌నినోతో ముప్పు తప్పదేమోనంటూ ఆవేదన చెందారు. భూమిలో వేసిన విత్తను దక్కించుకునేందుకు నానాతంటాలు పడ్డారు. వివిధ మార్గాల ద్వారా నీటి తడులు అందించి విత్తును దక్కించుకున్నారు. కాగా, ఈ నెలాఖరు నుంచే జిల్లాలో వాతావరణంలో భారీమార్పులు చోటు చేసుకున్నాయి. జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఫలితంగా వర్షాధారంగా సాగు చేసిన పత్తి, ఇతర ఆరుతడి పంటలకు ఊపిరి పోసినట్లయ్యింది.

### ఆశాజనకంగా భూగర్భ జలాలు

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది భూగర్భజలాలు సైతం ఆశాజనకంగా ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. గతేడాది భారీ వర్షాలు కురవటంతో చెరువులు, కుంటలు సమృద్ధిగా నిండి ఉండటమే ఇందుకు కారణమని పేర్కొంటున్నారు. జూన్‌లో సగటున 12.97 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉండగా, జూలైలో 13.47 మీటర్లకు పడిపోయింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు భూగర్భ జల మట్టాలు పెరిగే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు.

### బోరు బావుల కింద నాట్లు

గత వారం రోజులుగా సమృద్ధిగా వర్షాలు కురవడంతో సాగు పనులు ఊపందుకున్నాయి. అన్నదాతలు పొలాల్లో వివిధ పనులు చేస్తూ బిజీగా మారారు. కొందరు సాగునీటి ఆధారంగా బోరు బావుల కింద వరి నాట్లు ప్రారంభించారు. ఈ నెలాఖరు వరకు నాట్లు వేస్తే ఆశించిన దిగుబడి వస్తుందని, లేకపోతే నష్టం వాటిల్లే ప్రమాదం ఏర్పడుతుందని పేర్కొంటున్నారు.

### పోచారం ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో..

నాగిరెడ్డిపేట్, ఎల్లారెడ్డి మండలాలకు వరప్రదాయిని అయిన పోచారం ప్రాజెక్ట్‌లోకి కొత్త నీరు వచ్చి చేరుతోంది. సోమవారం నుంచి కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతాలైన గాంధారి, లింగంపేట, తాడ్వాయి, గుండారం వాగుల ద్వారా బుధవారం 1,526 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1.82 టీఎంసీలకు గాను ప్రస్తుతం 0.228 టీఎంసీలు నీరు ఉంది. పోచారం ప్రాజెక్టులోకి వరద నీరు రావడంతో మండలంలోని ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కళ్యాణి ప్రాజెక్ట్ జలకళను సంతరించుకుంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద ఉధృతి పెరగడంతో నిజాంసాగర్ ప్రధాన కాలువ లోకి, రెండు వరద గేట్ల ద్వారా నీటిని గోదావరి లోకి విడుదల చేస్తున్నారు. వర్షాలతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఉమ్మడి జిల్లాకు అలర్ట్

**అక్షరటుడే, కామారెడ్డి:** ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. భారత వాతావరణ శాఖ హైదరాబాద్ కేంద్రం బుధవారం విడుదల చేసిన ప్రకటన ప్రకారం గత 24 గంటల్లో కామారెడ్డితో పాటు నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం నమోదైంది. చత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దులో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం పశ్చిమంగా కదులుతుండడంతో రాగల 48 గంటల పాటు వర్షాలు కొనసాగనున్నాయి. బుధవారం కామారెడ్డి జిల్లాలో ఎల్లో అలర్ట్, నిజామాబాద్ జిల్లాలో ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. ఈ రెండు జిల్లాల్లో అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. గురువారం కామారెడ్డి, నిజామాబాద్ రెండు జిల్లాల్లోనూ ఆరెంజ్ అలర్ట్ కొనసాగనుంది. శుక్రవారం నుంచి వర్షాల తీవ్రత కొంత తగ్గినా రాష్ట్రవ్యాప్తంగా ఈదురు గాలులు 30 నుంచి 40 కి.మీ వేగంతో వీచే అవకాశం ఉంది. రాబోయే రోజుల్లో భారీ వర్షాలు, ఈదురుగాలులు, మెరుపులు సంభవించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణే అత్యంత ప్రాధాన్యమని పేర్కొంటూ ప్రతి ఒక్కరూ అధికార యంత్రాంగం జారీ చేసే సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. వర్షాల సమయంలో నదులు, వాగులు, చెరువుల వద్దకు వెళ్లొద్దన్నారు.



## కళ్యాణి ప్రాజెక్ట్‌కు పోటెత్తిన వరద.. రెండు గేట్లు ఎత్తివేత

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కళ్యాణి ప్రాజెక్ట్ జలకళను సంతరించుకుంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద ఉధృతి పెరగడంతో ప్రాజెక్ట్ నిండుకుండలా మారింది. వర్షాలకు వరద పెరుగుతుండడంతో నిజాంసాగర్ ప్రధాన కాలువలోకి నీటిని మళ్లిస్తున్నారు. ప్రాజెక్ట్ రెండు వరద గేట్ల ఎత్తి నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్‌లోకి ప్రస్తుతం 430 క్యూసెక్కులు వరద వస్తుండగా.. ఫ్లడ్ గేట్ల ద్వారా 250 క్యూసెక్కుల నీరు దిగువకు వదులుతున్నారు. నిజాంసాగర్ కాలువకు 180 క్యూసెక్కులు మళ్లిస్తున్నారు. గత ఏడాది భారీ వరదలకు కళ్యాణి ప్రాజెక్టు సైడ్ వాల్స్ కొట్టుకుపోయాయి. దీంతో మరమ్మతులు నిర్వహించారు. దీంతో నీటిని నిల్వ చేయకుండా వదులుతున్నట్లు అధికారులు తెలిపారు.



## ఠాణాను తనిఖీ చేసిన సీపీ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను సీపీ సాయిచైతన్య బుధవారం తనిఖీ చేశారు. స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు గౌరవం ఇస్తూ, సమస్యలపై వెంటనే స్పందించి వేగవంతంగా న్యాయం చేయాలని సూచించారు. కేసుల దర్యాప్తులో ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి నాణ్యమైన ఇన్వెస్టిగేషన్ చేయాలన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, డ్రగ్స్ వాడకంతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ఏసీపీలు ప్రకాష్ యాదవ్, గురునాయుడు, రూరల్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాస్, ఎస్సైలు షరీఫ్, ఆనంద్ సాగర్, మహేష్ పాల్గొన్నారు.

## విపత్తుల సమయంలో సేవలు అందించాలి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** విపత్తులు సంభవించిన సమయాల్లో ఆపద మిత్ర వలంటీర్లు తక్షణమే స్పందిస్తూ సహాయక చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ వి భుజంగరావు సూచించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆపద మిత్ర వలంటీర్లకు కిట్లు పంపిణీ చేశారు. విపత్తుల సమయాలలో సహాయక చర్యలు చేపట్టేందుకు ఉపకరించే 14 రకాల వస్తువులతో కూడిన ఈ కిట్‌ను ఎలా ఉపయోగించాలనే విషయాల గురించి ఎస్‌డీఆర్‌ఎఫ్ అధికారులు వివరించారు. విపత్తులు సంభవించిన సమయాల్లో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఆస్తి, ప్రాణ నష్టాన్ని ఎలా నివారించాలి, అత్యవసర సమయాలలో ప్రాథమిక చికిత్స పద్ధతులు, సీపీఆర్ చేసే విధానం, తదితర అంశాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అదనపు కలెక్టర్ భుజంగరావు మాట్లాడుతూ, విపత్తులను నిలువరించే శక్తి ఎవరికీ ఉండదని, అయితే ముందస్తు సన్నద్ధతతో ప్రాణ, ఆస్తి నష్టాల్ని చాలా వరకు నివారించవచ్చన్నారు. ఈ దిశగా క్షేత్రస్థాయిలో ఉండే ఆపద మిత్ర వలంటీర్లు విపత్తుల సమయాల్లో సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. ఇప్పటికే వలంటీర్లకు ప్రకృతి వైపరీత్యాల సమయాల్లో ఎలా వ్యవహరించాలి అనే అంశాలపై నిపుణుల ద్వారా శిక్షణ అందించామని గుర్తు చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి గీత మాట్లాడుతూ, ఆపద సమయాలలో ప్రజలకు సహాయపడే అవకాశం లభించడాన్ని అదృష్టంగా భావించాలని అన్నారు. ఆపద మిత్ర నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి సాయన్న మాట్లాడుతూ, ఆపద మిత్ర వలంటీర్లకు ప్రభుత్వం ఉచిత శిక్షణ ఇవ్వడంతో పాటు గుర్తింపు కార్డులు, ఉపకరణాలతో కూడిన కిట్లు అందజేసిందని, బీమా సదుపాయం వర్తింపజేస్తుందని గుర్తు చేశారు. ఈ తోడ్పాటును సద్వినియోగం చేసుకుని సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ డీ సెక్షన్ పర్యవేక్షకులు శ్రీనివాస్ రావు, ఆర్ఎస్ఐ శ్రీనివాస్, అగ్నిమాపక శాఖ, 7వ పోలీసు బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు.



## నగరంలో మున్సిపల్ కమిషనర్ పర్యటన

**అక్షరటుడే, నిజామాబాద్:** నగరంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దిలీప్‌కుమార్ విస్తృతంగా పర్యటించారు. నగరంలోని 1,8 డివిజన్ల పరిధిలోని కాలుర్, ఖానాపూర్, సాయినగర్ ప్రాంతాల్లో ఉదయాన్నే క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని డ్రైనేజీ సమస్యలు, తాగునీటి సరఫరా పరిస్థితులను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం లోతట్టు ప్రాంతాలను సందర్శించి, ఎటువంటి సమస్యలు తలెత్తకుండా తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే, ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండటానికి, డ్రైనేజీలపై అవసరమైన చోట్ల త్వరితగతిన కల్వర్టుల నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు.

## జిల్లాలో వాగులకు జలకళ.. హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు


జిల్లాలో వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో ఈ సీజన్‌లో వర్షా లు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. ఇన్ని రోజులు వర్షా లు లేక రైతులు ఆందోళన చెందారు. తాజాగా వరుణుడు కరుణించడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. నగర శివారులోని ఆకుల కొండూర్‌లో చెరువు అలుగు పారుతోంది. వానాకాలం ప్రారంభమైన తర్వాత మొదటిసారి అలుగు పారుతుండడంతో స్థానికులు, నగరవాసులు చూసేందుకు తరలివస్తున్నారు. కాలూర్–ఖానాపూర్‌కు వెళ్లే రోడ్డుపై ఉన్న వంతెనను తగులుతూ వరద ప్రవహిస్తోంది. దీంతో ఈ వంతెనకు ఇరువైపులా ఉన్న ప్రాంతాలు జలమయమయ్యాయి.



- అక్షరటుడే, ఇందూరు



## వర్షా కాలంలో విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండాలి..




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** వర్షాకాలంలో విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో ఎస్ఈ పీవీ రాజేశ్వర్‌రావు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. వర్షాకాలంలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు, భారీ వర్షాల కారణంగా విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని ఆయన తెలిపారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. వర్షం కురుస్తున్న సమయంలో విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లు, సపోర్ట్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ పరికరాలు లేదా తడి గోడలకు ఆనుకుని ఉన్న విద్యుత్ ఉపకరణాలను తాకవద్దన్నారు. తెగిపోయిన, వేళాడుతున్న లేదా తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలకు ఎట్టి పరిస్థితుల్లోనూ దగ్గరగా వెళ్లవద్దని హెచ్చరించారు. ఉరుములు, మెరుపులు సంభవిస్తున్న సమయంలో చెట్ల క్రింద నిలబడకండి. బహిరంగ ప్రదేశాల్లో అవసరం లేకుండా సంచరించవద్దన్నారు. ఇళ్లల్లో తడి చేతులతో స్విచ్‌లు, ప్లగ్‌లు, మీటర్ బోర్డులు, మోటార్లు, గీజర్లు, కూలర్లు, వాటర్ హీటర్లు లేదా ఇతర విద్యుత్ పరికరాలను తాకవద్దని పేర్కొన్నారు. సెల్‌ఫోన్లు ఛార్జింగ్‌లో ఉండగా ఫోన్ మాట్లాడవద్దని సూచించారు.

## బురదలో ఇరుక్కున్న ఆర్టీసీ బస్సు..



**అక్షరటుడే, కామారెడ్డి :** భారీ వర్షాలతో జిల్లాలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. తాజాగా కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని అడ్లూర్ రోడ్డుపై ఆర్టీసీ బస్సు రోడ్డు పక్కనున్న మట్టిలో కూరుకుపోయిన ఘటన ప్రయాణికులను భయాందోళనకు గురిచేసింది. కామారెడ్డి పాత బస్టాండ్ నుంచి బుధవారం గిద్ద గ్రామం మీదుగా పోసానిపేట్, గోకుల్ తండా వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు బుధవారం అడ్లూర్ రోడ్డుపై ప్రయాణిస్తోంది. ఎదురుగా వస్తున్న వాహనాలకు దారి ఇవ్వడానికి డ్రైవర్ బస్సును రోడ్డు పక్కకు తీయడంతో టైర్లు బురదలో ఇరుక్కుపోయాయి. డ్రైవర్ బయటకు తీసే ప్రయత్నంలో బస్సు మరింతగా బురదలోకి దిగి ఒకవైపు ఒరిగింది. దీంతో ప్రయాణికులు ఒక్కసారిగా ఆందోళన చెందారు. డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది.



# దర్జాగా సీఎంఆర్ మాయం..

రైతుల వద్ద నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసి, పౌరసరఫరాల శాఖకు బియ్యం రూపంలో అప్పగించాల్సి ఉంది. కానీ, జిల్లాలోని కొందరు రైస్ మిల్లర్లు ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని దర్జాగా బ్లాక్ మార్కెట్‌లో విక్రయించుకుంటూ రూ. కోట్లు సొమ్ము చేసుకుంటున్నారు. ఇన్నాళ్లూ రాజకీయ ఒత్తిళ్లు, అధికారుల నిర్లక్ష్యంతో సాగిన ఈ దోపిడీపై ప్రస్తుతం పౌరసరఫరాలు, విజిలెన్స్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. వరుసగా రైస్ మిల్లులపై ఆకస్మిక దాడులు చేస్తూ మిల్లర్ల అక్రమాలను వెలికితీస్తున్నారు.

- అక్షరటుడే, ఇందూరు

- రూ.కోట్లల్లో ప్రభుత్వానికి బకాయిలు
- మిల్లర్లపై ఆర్ఆర్ యాక్ట్ ప్రయోగం..!
- అధికారుల దాడుల్లో వెలుగుచూస్తున్న రూ. వందల కోట్ల అక్రమాలు

రైస్ మిల్లర్లు సీఎంఆర్ ఇవ్వకుండా అక్రమాలకు పాల్పడుతున్నారు. కొందరు అక్రమార్కులు ఆ బియ్యాన్ని బహిరంగ మార్కెట్లో అమ్మేసుకున్నారు. నిబంధనల ప్రకారం ప్రతీ సీజన్ ముగియగానే సీఎంఆర్ లెక్కలు తేల్చి, మిల్లులపై ఒత్తిడి తెచ్చి బియ్యాన్ని రాబట్టాల్సిన పౌరసరఫరాల శాఖ అధికారులు ఇన్నాళ్లూ తీవ్ర నిర్లక్ష్యం వహించారు. దీనికితోడు ప్రజాప్రతినిధుల మద్దతు ఉండటంతో మిల్లర్లు ఆడింది ఆటగా మారింది.

### దాడుల్లో బయటపడ్డ విస్తుపోయే నిజాలు

ఇటీవల సివిల్ సప్లై, విజిలెన్స్ అధికారులు జిల్లాలోని పలు రైస్ మిల్లులపై నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. నగర శివారులోని కాలూర్‌లో శ్రీ సిద్ధి రామేశ్వర ఆగ్రో ఇండస్ట్రీస్‌లో నిర్వహించిన తనిఖీల్లో 2022-23 యాసంగి నుండి 2025-26 రబీ సీజన్ల వరకు ఏకంగా 2,03,688 క్వింటాళ్ల ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖకు అందించకుండా మాయం చేసినట్లు తేలింది. సుమారు రూ. 66.12 కోట్ల ప్రజాధనాన్ని స్వాహా చేసినట్లు నిర్ధారించిన అధికారులు, మిల్లు నిర్వాహకుడు శ్రవణ్‌పై కేసు నమోదు చేశారు. బోధన్ మండలం సాలూరలోని సాయి లక్ష్మి ఆగ్రో ఇండస్ట్రీస్‌లో విజిలెన్స్ అధికారులు జరిపిన దాడిలో ఈ మిల్లుకు కేటాయించిన ధాన్యంలో రూ.4.31 కోట్ల విలువైన 19,631 క్వింటాళ్ల ధాన్యం/బియ్యం ప్రభుత్వానికి ఇవ్వకుండా పక్కదారి పట్టించినట్లు తేలింది. దీంతో ఈ మిల్లుపై కూడా కేసు నమోదు చేశారు.

### ఓ మాజీ ప్రజాప్రతినిధి..

బోధన్ నియోజకవర్గానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి తన బంధువుల పేర్లతో నడుపుతున్న 11 రైస్ మిల్లుల్లో ఇప్పటివరకు రూ.58 కోట్లకు పైగా విలువైన సీఎంఆర్ పెండింగ్‌లో ఉంది. గతంలో అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడల్లా సదరు నేత తన రాజకీయ ప్రభావంతో చర్యలు తీసుకోకుండా మేనేజ్ చేసినట్లు తెలుస్తోంది. ప్రతి ఏడాది ప్రభుత్వం నిర్ణీత గడువులోగా సీఎంఆర్ పూర్తి చేయాలని ఆదేశిస్తున్నప్పటికీ, చాలామంది మిల్లర్లు ఆ నిబంధనలను బేఖాతరు చేస్తున్నారు. రాజకీయ నాయకుల ద్వారా అధికారులపై ఒత్తిడి తెచ్చి తనిఖీలు జరగకుండా అడ్డుకునేవారు. అయితే తాజాగా అధికారులు కలెక్టర్ సూచనల మేరకు డిఫాల్టర్ రైస్‌మిల్లులపై కొరడా ఝులిపిస్తున్నారు. ఇప్పటికైనా రూ.కోట్లల్లో బకాయి పడ్డ రైస్‌మిల్లులపై కఠిన చర్యలు తీసుకుంటారా.. లేదా మధ్యలోనే వదిలేస్తారా వేచిచూడాల్సిందే.

### మిల్లర్లపై ఆర్ఆర్ యాక్ట్ ప్రయోగం..!

దీనికి సంబంధించి తాజాగా విజిలెన్స్ అధికారులు డిఫాల్టర్ రైల్‌మిల్లులపై ఆర్ఆర్ చట్టం ప్రయోగించే అవకాశం ఉంది. ఏళ్లుగా దర్జాగా ప్రభుత్వం ధాన్యాన్ని మింగేసి రూ.కోట్లు సంపాదించిన అక్రమార్కులపై చర్యలకు అధికారులు ఉపక్రమిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఈ చట్టం కింద అవసరమైతే ఆస్తుల జప్తు, బ్యాంకు ఖాతాలపై చర్యలు లేదా ఇతర చట్టపరమైన రికవరీ ప్రక్రియలు చేపట్టే అవకాశం ఉంటుంది. అయితే ఇదంతా ముందే ఊహించిన సదరు రైస్‌మిల్లర్లు చట్టంలోని లొసుగులను పసికట్టి తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లుగా సమాచారం.



## ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలి

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** దవాఖానాల్లో ప్రజల కోసం నిర్వహించే ఆరోగ్య కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చేయాలని డీఎంహెచ్‌వో రాజశ్రీ తెలిపారు. డిచ్‌పల్లి మండలం నడిపల్లి పల్లె దవాఖానను బుధవారం డీఎంహెచ్‌వో సందర్శించారు. సార్వత్రిక రోగనిరోధక కార్యక్రమం, ఇతర ఆరోగ్య కార్యకలాపాలను సమీక్షించారు. వ్యాక్సినేషన్లు, మాతా శిశు సంరక్షణ, ఫీవర్ సర్వే, కార్యకలాపాలపై ఆరా తీశారు. ప్రజలకు సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయాలని సూచించారు. యాంటీలార్వల్ ఆపరేషన్లు, సోర్స్ రిడక్షన్ అన్ని రికార్డులను తాజాగా నిర్వహించి సమర్థవంతమైన పర్యవేక్షణ ఉండేలా చూడాలని సిబ్బందికి సూచనలు చేశారు.



## అవంతి ఆక్వా ఫీడ్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు

**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిషరీస్ విభాగానికి చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిష్టాత్మక మల్టీ నేషనల్ సంస్థ అవంతి ఆక్వా ఫీడ్‌లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. క్యాంపస్ ఎంపికల్లో పాల్గొన్న కె. సిద్ధార్థ, ఎస్. ఆకాష్, వి. శ్రీజిత్ తమ ప్రతిభతో ఈ అవకాశాన్ని సొంతం చేసుకున్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. విజయ్ కుమార్ బుధవారం శాలువాతో సన్మానించి అభినందించారు. ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యాలను అందిస్తున్నామని, ఈ నియామకాలే అందుకు నిదర్శనమని తెలిపారు.విశ్వప్రసాద్, జయ ప్రకాష్, దినకర్ చిన్న, శ్రీనివాసరావు, రాములు, మల్సూర్, రాజేందర్, పవన్ కుమార్ పాల్గొన్నారు.

## బాధితుడికి ఎల్‌వోసీ అందజేత

**అక్షరటుడే, భీమ్‌గల్:** తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న భీమ్‌గల్ మండలం మెండోరా గ్రామానికి చెందిన అల్లెపు నర్సయ్యకు సీఎం సహాయ నిధి నుంచి రూ.2.50 లక్షల ఎల్‌వోసీ మంజూరైంది. ఈ మేరకు మంజూరు పత్రాన్ని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ కుమార్ బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. గ్రామానికి చెందిన నర్సయ్య తీవ్ర అస్వస్థతకు గురికావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చేర్చారు. పరీక్షించిన వైద్యులు అత్యవసరంగా శస్త్రచికిత్స చేయాలని సూచించగా, నిరుపేద కుటుంబానికి చెందిన బాధితులు ఆర్థిక సహాయం కోసం ముత్యాల సునీల్ కుమార్‌ను ఆశ్రయించారు. వెంటనే స్పందించిన ఆయన ప్రభుత్వం ద్వారా రూ.2.50 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. ఆపద సమయంలో పెద్ద మనసుతో ఆదుకున్న సునీల్ కుమార్‌కు బాధితుడి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

## బాలికపై అఘాయిత్యం.. పోక్సో కేసు నమోదు

**అక్షరటుడే, బాన్సువాడ:** మైనర్‌ను ప్రేమ పేరుతో ఓ వ్యక్తి మోసం చేశాడు. దీంతో బాలిక ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడ మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ తన బంధువులకు చెందిన బాలికతో మూడేళ్ల క్రితం పరిచయం పెంచుకున్నాడు. తనకు భార్య పిల్లలు ఉన్నా.. చెప్పకుండా బాలికను ప్రేమిస్తున్నానని దగ్గరయ్యాడు. పలుమార్లు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ విషయం తెలిసిన తల్లిదండ్రులు బాలికను బంధువుల ఇంటికి పంపి రెండు నెలల పాటు అక్కడే ఉంచారు. తిరిగి వచ్చిన తర్వాత పెళ్లి చేసుకోవాలని కోరగా వివాహం చేసుకునేది లేదని సదరు వ్యక్తి పేర్కొన్నాడు. దీంతో తనను మాయమాటలు చెప్పి మోసం చేశాడని పేర్కొంటూ బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో పోలీసులు సంబంధిత వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేశారు.

## పోస్టల్ ఖాతా తెరవాలని ఇబ్బంది పెట్టవద్దు..

**అక్షటుడే, పెద్ద కొడప్‌గల్:** మండలంలోని వివిధ గ్రామాలలో పింఛన్‌దారులను పోస్టాఫీస్ సిబ్బంది ఇబ్బందులు పెడుతున్నారని తమకు సమాచారం వచ్చిందని ఇది సరైన పద్ధతి కాదని..ఎంపీడీవో అభినవ్ చందర్ పేర్కొన్నారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. చేయూత పింఛన్ల కోసం వృద్ధులతో తప్పనిసరిగా పోస్టాఫీస్ ఖాతా తెరవాలని సూచించడం సరైంది కాదన్నారు. పోస్టల్ సిబ్బంది ఇలాంటి చర్యలకు పాల్పడితే శాఖాపరమైన

## ఫీజు బకాయిలు విడుదల చేయాలి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు ఫీజు బకాయిలు విడుదల చేయకపోతే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వంశీగౌడ్ పేర్కొన్నారు. 'ఫీజు బకాయి – బీజేపీ లడాయి' కార్యక్రమంలో భాగంగా కిట్స్ కళాశాలలో బీజేవైఎం ఆధ్వర్యంలో విద్యార్థుల సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. వంశీ గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న 'ఫీజు బకాయి – బీజేపీ లడాయి' ఉద్యమానికి విద్యార్థుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. కళాశాలల్లో ప్రత్యక్షంగా విద్యార్థులను కలిసి వారి సమస్యలను తెలుసుకుంటూ, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నామని తెలిపారు. ప్రతి విద్యార్థి ఈ ఉద్యమంలో భాగస్వామి కావాలని,మిస్డ్ కాల్, క్యూఆర్‌కోడ్ ద్వారా సంతకం చేసి విద్యార్థుల న్యాయమైన డిమాండ్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు. బీజేవైఎం తెలంగాణ రాష్ట్ర కోకోశాధికారి అమంద్ విజయ్ కృష్ణ, బీజేవైఎం నాయకులు విపుల్ రావు, రాజ్ గణేష్, రాకేష్, సిసింద్రీ, రాజశేఖర్ పాల్గొన్నారు.

## జాతివైరం మరిచి.. స్నేహానికి అర్థం చెప్పి..

**సాధారణంగా కుక్క, పిల్లి ఎదురైతే చాలు ఒకదానిపై ఒకటి గుర్రుగా చూసుకుంటాయి. దాడి చేసేందుకు సిద్ధమవుతాయి. ఎల్లారెడ్డి పట్టణంలో కనిపించిన ఈ దృశ్యం పూర్తిగా భిన్నంగా ఉంది. ఓ కుక్క హాయిగా సేదదీరుతుండగా ఉండగా.. పిల్లిసైతం కుక్కవద్దకు చేరి నిద్రపోయింది. ఈ దృశ్యాన్ని చూసిన ప్రతి ఒక్కరూ ఆశ్చర్యానికి గురయ్యారు. స్నేహానికి జాతివైరాలు అడ్డురావని ఈ జీవాలు నిరూపించాయని పలువురు వ్యాఖ్యానించారు.**

**– సిద్ధు గౌడ్, అక్షరటుడే ఎల్లారెడ్డి**



## డ్రైనేజీ పనుల్లో నిర్లక్ష్యం.. నీటమునిగిన పోస్టాఫీస్



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి పట్టణంలో సాగుతున్న మురుగు కాలువలు, అమృత్ 2.0 పనుల్లో తీవ్ర జాప్యం, నిర్లక్ష్యంపై స్థానిక ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం, కాంట్రాక్టర్ల అసమర్థత కారణంగా పట్టణంలో పలు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఎల్లారెడ్డి పోస్టాఫీస్ ఆవరణ నీటమునిగింది. 3వ వార్డులోని గ్రంథాలయ మార్గంలో అమృత్ 2.0 పనుల కోసం ఓ షాపింగ్ కాంప్లెక్స్ రక్షణ గోడను కాంట్రాక్టర్ సిబ్బంది కూల్చివేశారు. దీంతో వర్షం నీరు నేరుగా సుమారు 8 దుకాణాల్లోకి చేరింది. రూ.లక్షల విలువైన కంప్యూటర్లు, ఫర్నిచర్, ఇతర సరుకులు తడిసి ముద్దవ్వడంతో వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. నీరు దుకాణాల్లోకి రాకుండా స్థానిక వ్యాపారులే సొంత ఖర్చులతో సిమెంట్ పనులు చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యపై మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బాధితులు మండిపడుతున్నారు.

## ఓటరు జాబితా సవరణలో బీఎల్ఏలు కీలక పాత్ర పోషించాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) కీలక పాత్ర పోషించాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు నీలం చిన్నరాజులు పిలుపునిచ్చారు. బుధవారం బాన్సువాడ పట్టణంలో నియోజకవర్గంలోని బీఎల్ఏ ఇన్‌చార్జిలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా అర్హులైన ప్రతి ఓటరు పేరును జాబితాలో నమోదు చేయించడం, ఓటరు వివరాల్లో ఉన్న తప్పులను సరిదిద్దడం, కొత్తగా అర్హత పొందిన వారిని ఓటర్లుగా నమోదు చేయించడం వంటి అంశాలపై బీఎల్ఏలు చురుకుగా పనిచేయాలని సూచించారు. ఎన్యుమరేషన్ ఫారాలు తీసుకుని ఇప్పటివరకు సమర్పించని ప్రతి ఓటరును గుర్తించి, వారు ఫారాలను పూర్తిగా నింపి సంబంధిత బీఎల్ఓలకు అందజేసేలా వ్యక్తిగతంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. కేవలం ఫారాల పంపిణీతోనే సరిపెట్టకుండా, ప్రతి ఫారం డిజిటలైజేషన్ జరిగిందా లేదా అనే విషయాన్ని కూడా బీఎల్ఏలు పరిశీలించాలని సూచించారు.

## 'జలసిరి' కార్యక్రమంపై గ్రామస్థులకు అవగాహన



**అక్షరటుడే, పెద్దకొడప్‌గల్ :** మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో సర్పంచ్ రామారావు పటేల్ ఆధ్వర్యంలో గ్రామస్థులకు 'జలసిరి' నీటి నిల్వపై అవగాహన సమావేశం నిర్వహించారు. భూగర్భజలాల నీటి మట్టాన్ని పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపడుతున్న జలసిరి కార్యక్రమాన్ని గ్రామంలో విజయవంతం చేయాలని ఆయన కోరారు. గ్రామంలో ప్రతి ఇంటికి ఇంకుడు గుంతలు, రైతుల భూముల్లో నీటికుంటల నిర్మాణం, ఎండిపోయిన బోరుబావుల వద్ద రిచార్జ్ గుంతలు ఏర్పాటు చేయాలన్నారు. రాబోయే రోజులలో భూగర్భజలాలు పడిపోకుండా ఉండాలంటే ముందు జాగ్రత్తగా నీటి నిల్వపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. వర్షం నీటిని భూమిలోకి ఇంకేలా చేసి, భూగర్భ జలాల నీటిమట్టాన్ని పెంచుకోవచ్చన్నారు. గ్రామపంచాయతీ కార్యదర్శి సాయిలు, గ్రామస్థులు పాల్గొన్నారు.